క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా పనిచేద్దాం

భట్టిప్రోలు: అంతా సమష్టిగా పనిచేసి వేమూరు గడ్డపై మరోమారు వైఎస్సార్ సీపీ జెండాను ఎగుర వేయాలని తద్వారా జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి అన్నారు. శనివారం రాత్రి భట్టిప్రోలులో శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి కల్యాణం పురస్కరించుకుని ఆమె పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె దళితవాడలో మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ శ్రేణులంతా ఐక్యతగా పని చేసేందుకు సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పాలన చూసి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని కోరారు. మహిళలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యులు కొతరపు పద్మావతి, కుక్కల వెంకట్రామయ్య, పెరికల శ్యాంసుందరరావు, డి. నాగమల్లేశ్వరరావు, టి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి మృతి కారకులను శిక్షించాలి

ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జీ.బాలాజీ

భట్టిప్రోలు: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు పాలెం సుబ్బారావు ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారులు, భూ ఆక్రమణ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.బాలాజీ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన భట్టిప్రోలులో మాట్లాడుతూ గత కొంత కాలంగా కబ్జా చేసిన తన భూమిని అప్పగించాలని రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేసినా ఫలితం లేకపోవడంతో శనివారం సుబ్బారావు రైలు కింద పడి మృతి చెందగా ఆయన భార్య పద్మావతి, కుమార్తె వినయలు ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారన్నారు. వీరి కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ రాష్ట్ర సమితి సభ్యులు కె.రామకోటేశ్వరరావు, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెదపులివర్రులో వైభవంగా రథోత్సవం



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన శ్రీ భూనీళా సమేత వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం నిత్య హోమం, బలి హరణ, రాత్రి రథోత్సవం నిర్వహించారు. పూజా. కార్యక్రమాలను అర్చకులు శాస్త్రయుక్తంగా జరిపారు. కార్యక్రమాలను దేవస్థాన కార్యనిర్వహణాధికారి మేకా సాంబశివరావు పర్యవేక్షించారు.

చిరు వ్యాపారులకు గొడుగులు అందజేత



భట్టిప్రోలు: వేసవి దృష్ట్యా చిరు వ్యాపారుల కోసం భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ (బీఎఫ్ఏ) గొడుగులు అందజేసింది. ఆదివారం భట్టిప్రోలులో వివిధ రకాల చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటున్న వారికి 12 గొడుగులు పంపిణీ చేశారు. గత కొంత కాలంగా బీఎఫ్ఏ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పరిధిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చిరు వ్యాపారుల కోసం గొడుగులు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీఎఫ్ఏ ప్రతినిధులు దొంతు ఆదినారాయణ, వంగర బాబుజీ, కె.సత్యన్నారాయణ, బి. జయబాబు, కే శ్రీనాథ్, వినోద్, ఆదినారాయణ, పి శివరామ ప్రసాద్, బి మధు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం తరలింపులో ఇద్దరిపై కేసు

బాపట్లటౌన్: ప్రభుత్వ మద్యం దుకాణంలో ఉద్యోగం చేసే ఇరువురు అక్రమంగా మద్యాన్ని తరలించడంతో సెబ్ అధికారులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని భర్తపూడి వైన్‌షాపులో సేల్స్‌మ్యాన్‌గా విధులు నిర్వర్తించే కాకుమాను నాగపూర్ణ చందు, అదే షాపులో వాచ్‌మేన్‌గా విధులు నిర్వర్తించే పులి శివయ్యలు వైన్‌షాపు నుంచి ఏసీ బ్లాక్ క్లాసిక్ 46 క్వాటర్ బాటిల్స్‌ను అక్రమంగా తరలించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సెబ్ అధికారులు షాపు వాచ్‌మెన్ పులి శివయ్య, హీరో ప్యాషన్ ప్రో ద్విచక్రవాహనాన్ని అదుపులోకి తీసుకొని విచారించగా సేల్స్‌మ్యాన్ పూర్ణచందు సహకారంతోనే ఇదంతా జరిగిందని విచారణలో అంగీకరించాడు. దీంతో ఇరువురిపై కేసు నమోదుచేసినట్లు సెబ్ సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఘనంగా లక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకారంలో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ



ఆలయంలో పొంగళ్ల తయారీలో నిమగ్నమైన మహిళలు

- తరలివచ్చిన భక్త జనం
- ఉత్సవాల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

కొల్లూరు : మండల పరిధిలో తిరునాళ్ల వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. ఆదివారం మండలంలోని దోనేపూడి లక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల, పెసర్లంకలోని నాంచారమ్మ తల్లి తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దోనేపూడిలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దైవ దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతంలో పొంగళ్లు తయారు చేసుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు కుటుంబ సమేతంగా ఎడ్లబళ్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలలో తరలివచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని దర్శించుకొని వేడుకొన్నారు. ఆలయం వద్ద తిరునాళ్ల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం నుంచి ఆలయానికి వెళ్లే మార్గంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. భారీ వాహనాల రాకపోకలను నిలువరించి కొల్లూరు కరకట్ట మీదుగా మళ్లించారు. పెసర్లంకలోని నాంచారమ్మ తిరునాళ్ల వేడుకలకు రాత్రి సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దైవ దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇరు ఆలయాల వద్ద శాంతియుత వాతావరణం కోసం పోలీసుల పహారా కొనసాగింది.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు



వేమూరులో రక్షణ సైన్యం ఆధ్వర్యంలో ర్యాలీ



రక్షణ సైన్యం ఆధ్వర్యంలో చిన్నారుల ప్రదర్శన



మట్లతో వీధుల్లో తిరుగుతున్న చిన్నారులు

రేపల్లె రూరల్: పట్టణంలో పలు చర్చిల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం పర్వదినాన్ని క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. పలు చర్చిల ఆధ్వర్యంలో విశ్వాసులు ఈత మట్టలను పువ్వులతో అలంకరించి క్రీస్తు నామాన్ని, క్రీస్తు గీతాలను ఆలపిస్తూ పురవీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చర్చిలలో నిర్వహించిన కార్యక్రమాలలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్, మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కౌన్సిలర్‌లు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం

బాపట్ల: రక్షణ సైన్యం విద్యానగర్ కేర్ కమాండింగ్ అధికారులు మేజర్ డీ.ఏబు, మేజర్ డీ జ్యోతిల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు మణి భూషణ్, మేడి చక్రవర్తి, బోడ షరూర్ చంద్ర , విజయ్ కుమార్, కొంగ్రు కరుణాకర్, సంఘ పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు. బాపట్ల పట్టణ, రూరల్ మండలంలోని పలు చర్చిలలో మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీబీజెడ్ చర్చి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

మట్టల ఆదివారం వేడుకలు

కొల్లూరు : మట్టల ఆదివారం వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు ప్రార్థనా మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పూలతో అలంకరించిన ఈత మట్టలను ప్రదర్శిస్తూ చిన్నారులు ప్రదర్శనలు చేశారు. మత ప్రవచనాలతో కూడిన ప్రార్థనలతో పాస్టర్లు ఏసు ప్రభువు గీతాలను ఆలపిస్తూ వీధుల్లో చిన్నారులతో కలసి ప్రదర్శనలో పాల్గొన్నారు. వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం

భట్టిప్రోలు: క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించే ఈస్టర్ పండుగకు ముందు వచ్చే మట్టల ఆదివారం రోజును ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. చిన్నారులు క్రీస్తును శిలువ వేయడానికి నిరసనగా పూలతో అలంకరించిన ఈత మట్టలను చేత బూని వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. పాస్టర్లు దైవ సందేశాన్ని అందించారు. భట్టిప్రోలు సార్వత్రిక లూథరన్ సంఘం-క్రీస్తు లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో ఏసు జయ ప్రవేశ ఆహ్వాన ర్యాలీ నిర్వహించారు. గురు మండల అధ్యక్షులు రెవరెండ్ దాసరి రవీంద్రవర్మ ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు. వెల్లటూరు క్రీస్తు లూథరన్ దేవాలయంలో సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, అంబేడ్కర్ యూత్, సండే స్కూల్ విద్యార్థులు, అద్దేపల్లి ఇందిరా కాలనీలో జయ ధ్వని ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు.

వేమూరు: వేమూరు మండల కేంద్రంలోని రక్షణ సైన్యం అధ్వర్యంలో ఆదివారం మట్ల ఆదివారం పండగ ఘనంగా నిర్వహించారు. భక్తులు, పిల్లలు ఏసు క్రీస్తును స్తుతిస్తూ వీధుల్లో పర్యటించారు.

చావలి(వేమూరు): వేమూరు మండలంలోని చావలి గ్రామంలో బాపిస్టు చర్చిలో ఆదివారం మట్ల పండగ ఘనంగా నిర్వహించారు. పిల్లలు మట్లకు పూలు గుచ్చి వీధుల్లో పర్యటించారు. చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన ముస్లిం మత పెద్దలు



ఎమ్మెల్యే కోన రఘుపతితో టీడీపీ ముస్లిం మత పెద్దలు

బాపట్ల: ముస్లింల పూర్తి మద్దతు వైఎస్సార్ సీపీకి ఉంటుందని మున్సిపల్ మాజీ ప్రతి పక్షనేత షేక్.సయ్యద్ ఫీర్ పేర్కొన్నారు. పట్టణంలోని జమేదారుపేట 6, 8 వార్డులకు సంబంధించి 27 మంది ముస్లిం పెద్దలు ఎమ్మెల్యే కోన రఘుపతి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో ఆదివారం చేరారు.ఈ సందర్భంగా ముస్లీం నాయకులు, మాజీ ప్రతి పక్షనేత షేక్ సయ్యద్‌పీర్ మాట్లాడుతూ బీజేపీతో టీడీపీ కలయిక ముస్లిం సమాజాన్ని విచ్ఛిన్నం చేసేందుకేనని అన్నారు. మాజీ కౌన్సిలర్ మొహిద్దీన్ మాట్లాడుతూ బాపట్లను అభివృద్ధి వైపు నడిపించిన కోన రఘుపతికి పూర్తిగా ముస్లింల మద్దతు ఉంటుందని తెలిపారు. సొంత ఖర్చుతో ఆయన మసీదుల అభివృద్ధి చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్ల ప్రాంతానికి కావాల్సిన అన్ని హంగులు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నన్నాబచ్చా, మస్తాన్‌వలి, అసముద్దుల్లాఖాన్ తదితరులు ఉన్నారు.

దళితుల హక్కులు పరిరక్షించుకోవాలి

రేపల్లె రూరల్: ఐకమత్యంతో మెలిగి దళితులు తమ హక్కులను పరిరక్షించుకోవాలని నియోజకవర్గ దళితుల ఆత్మీయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. పట్టణంలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ దళితుల ఆత్మీయ సదస్సులో పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. నియోజకవర్గంలో 45వేల ఓట్లు కలిగిన దళిత సామాజిక వర్గానికి రాజకీయంగా అన్ని పార్టీలు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, దారం సాంబశివరావు, మేడికొండ సుధాకరచంద్రహాసరావు, గుజ్జర్లమూడి ఇమ్మానుయేలు భాస్కర్, రవికిరణ్, హనోక్, డానియేలు, మణిలాల్ తదితరులు పాల్గొన్నారు.

కారులో రూ.లక్ష నగదు పట్టివేత

తెనాలిరూరల్: కారులో తరలిస్తున్న రూ.లక్ష నగదును పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కృష్ణా జిల్లాకు చెందిన వ్యక్తి తన కారులో రూ.లక్ష నగదుతో తెనాలి నుంచి అంగలకుదురు వైపు వెళుతుండగా జేఎంజే కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద త్రీ టౌన్ పోలీసులు కారును తనిఖీ చేశారు. డ్యాష్ బోర్డులో లక్ష నగదు ఉండగా స్వాధీనం చేసుకుని నగదుకు సంబంధించిన పత్రాలు తీసుకురావాలని సదరు వ్యక్తికి తెలిపారు. నిబంధనలకు మించి ఎవరూ నగదును తరలించకూడదని సీఐ ఎస్.రమేష్‌బాబు తెలిపారు.

నేత్రాల పరిరక్షణలో అశ్రద్ధ వద్దు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నిజాంపట్నం: నేత్రాలను పరిరక్షించుకోవటంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిజాంపట్నం బ్రాంచి చైర్మన్ కాశేపల్లి గౌరీశంకర్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, వాసవీ క్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి వారిచే నిజాంపట్నంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవుని శరీరంలో అతి సున్నితమైన అవయవం నేత్రాలని ఆ నేత్రాలకు ఎటువంటి అనారోగ్య సమస్య తలెత్తినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శంకర్ కంటి ఆసుపత్రి వైద్యురాలు మేఘన మాట్లాడుతూ వైద్య శిబిరంలో ప్రజలకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. 223 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించగా 127 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ గంగాధర్, రెడ్‌క్రాస్ సొసైటీ జాయింట్ సెక్రటరీ బసవరాజు, వాసవీ క్లబ్ రీజియన్ చైర్మన్ వై.సత్యనారాయణ, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ బయ్యా శ్రీనివాసరావు, సెక్రటరీ కే.హనుమాన్, సభ్యులు వాసు, మహేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం



తెనాలిటౌన్: పట్టణ బాలాజీరావుపేటలోని అయ్యప్ప ప్రధాన ఆలయంలో ఆదివారం కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దుర్గా హరిబాబు స్వామి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఏ.వెంకటలక్ష్మి శిష్య బృందం సభ్యులు నృత్యం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని హరిబాబు స్వామి ప్రారంభించి భక్తులకు అన్నదానం చేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



చినపరిమి హైస్కూల్‌లో చదువుకున్న 1994-1995 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదివిన 1994-1995 విద్యా సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాత మిత్రులంతా ఓ చోటకు చేరి సరదాగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. చినపరిమిలో రథోత్సవం సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని రథం లాగారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు
- అద్దేపల్లి, దాసరిపాలెంలో ఆత్మీయ సమావేశాలు



పార్టీలో చేరిన వారితో వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: రాష్ట్రంలో గడచిన ఐదేళ్ల కాలంలో పేద,బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందడానికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు సీఎంను చేయాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి, గొరిగపూడి పరిధిలోని దాసరిపాలెంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి పనులతో పాటు పొందిన సంక్షేమ పథకాలను మరువకుండా మరొకసారి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం(చిన్నారి) ఆధ్వర్యంలో కాపు, యాదవ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీల నుంచి 12 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని సన్నిధిలో ఎంపీ మోపిదేవి



పూజల్లో పాల్గొన్న మోపిదేవి, డాక్టర్ ఈవూరి గణేష్

రేపల్లె రూరల్: ఉప్పూడి రోడ్డులో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవ వేడుకలు ఆదివారంతో నాల్గవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా స్వామివారికి నిత్యహోమం, బలిహరణ, మహాశాంతి హోమం పూజాది కార్యక్రమాలను వేదమంత్రాల నడుమ ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి రథోత్సవం చేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అక్షరం విలువను గుర్తెరగాలి

వర్ధమాన రచయిత వెంకు సనాతన



కవులను సన్మానిస్తున్న సాహితీ భారతి ప్రతినిధులు

బాపట్ల: ప్రపంచాన్ని నేడు అక్షరం శాసిస్తోందని అక్షరం రానిదే రక్షణ లేదని వర్ధమాన రచయిత వెంకు సనాతన అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక సీనియర్ సిటిజన్ కార్యాలయంలో సాహితీ భారతి ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రపంచంలో నేడు సాహితీవేత్తలు కవితా దినోత్సవం జరుపుకుంటున్నారని అక్షరం నేర్వకపోతే రక్షణ కరువవుతుందని గ్రహించాలన్నారు. సాహితీ భారతి ఉపాధ్యక్షులు మర్రి మాలాద్రిరావు సభకు అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు మాట్లాడుతూ అందరికీ అర్థమయ్యే తెలుగుభాషలో వచన కవిత్వానికి ప్రాధాన్యత సంతరించుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా రచయితలు బందా సుందరదుర్గాప్రసాద్, ప్రజా కవి డాక్టర్ శ్రీనివాస్, వెంకు సనాతన, ఎంఎల్‌వీ ప్రసాద్‌లను సాహితీ భారతీ రచయితలు సన్మానించారు. సభకు సాహితీ భారతి కార్యదర్శి కస్తూరి శ్రీనివాసరావు స్వాగతం పలికారు. ఉపాధ్యక్షులు మర్రి మాలాద్రి రావు సభకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో దేవి కృష్ణారావు, వెంకట్రావు, కె సుబ్బారావు, ఎం గుప్తా, ఎస్‌పీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ సభా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

జగనన్న పాలనతోనే పేద వర్గాల అభ్యున్నతి

వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు



క్రాపలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు : బలహీన, పేద వర్గాల అభ్యున్నతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలోనే సాధ్యపడుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని క్రాపలో పర్యటించిన ఆయన స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కలసికట్టుగా నిలిచి ఎన్నికల్లో సమిష్టి కృషితో పార్టీకి మెజార్టీ చేకూరేలా వ్యవహరించాలని సూచించారు. వెనుకబడిన వర్గాలకు సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అందించి వారి కుటుంబాల అభివృద్ధికి దోహదపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి వస్తే ప్రతి ఒక్క కుటుంబం ఆర్థికంగా పుంజుకోవడంతో పాటు వారి పిల్లలకు మెరుగైన విద్య, వైద్యం అందుతాయన్నారు. తొలుత ఆయన గ్రామంలో పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల అనంతరం ప్రజల మద్దతుతో తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాబోతున్నదని స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఉప సర్పంచ్ అంకమ్మరావు, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, మాజీ వైఎస్ ఎంపీపీ తాడికొండ రాంబాబు, మాజీ సర్పంచ్‌లు బొర్ర వీరరాఘవయ్య, కట్టుపల్లి సోమయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మాణిక్యరావు, మాదల నాగేశ్వరరావు, సాంబయ్య, కనపర్తి మోహన్‌రావు, ఉప్పు శ్రీనివాసరావు, మాతంగి రత్నకుమార్, దూళిపాళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



బీఎస్ఎఫ్ దళాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బాపట్లటౌన్: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ శ్రీహరి తెలిపారు. మండలంలోని కంకటపాలెంలో ఆదివారం సాయంత్రం బీఎస్ఎఫ్ దళాలతో కవాతు నిర్వహించారు. రూరల్ సీఐ శ్రీహరి మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా ఓటర్లను ప్రలోభాలకు, భయ భ్రాంతులకు గురిచేస్తే అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ముఖ్యంగా గ్రామంలో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటు కలిగిన వ్యక్తులు ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా ఉండాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు తాము చెప్పిన వ్యక్తికే ఓటు వేయాలంటూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా, బెదిరించినా అలాంటి వ్యక్తులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.